క్లుప్తంగా

సన్మానం



వెంకటాపురం(కె): చేయూత స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు చిడెం సాయి ప్రకాశ్‌ను శుక్రవారం ఏటూరునాగారం ఐటీడీఏ అతిథి గృహంలో మంత్రి సీతక్క సన్మానించారు. సాయి ప్రకాశ్‌ను భద్రాద్రి కొత్తగూడెం, ములుగు జిల్లాల్లో రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేసి ప్రజలకు కావాల్సిన రక్తన్ని అందించే మంచి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయం అని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఏటూరునాగారం మండల అధ్యక్షుడు చిటమట రఘు, మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ ఖాన్, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహమ్మద్ గౌస్ తదితరులు ఉన్నారు.

దరఖాస్తు చేసుకోవాలి

ములుగు రూరల్: మండలంలోని బండారుపల్లి మోడల్ పాఠశాలలో 6వ తరగతి నుంచి పదవ తరగతి వరకు హిందీ సబ్జెక్ట్ బోధించేందుకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ శోభరాణి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హవర్లీ బేస్డ్ టీచర్(హెచ్‌బీటీ) పోస్టుకు జూలై 02 లోపు దరఖాస్తులను పాఠశాలలో సమర్పించాలని అన్నారు. 03న డెమో నిర్వహించి ఎంపిక చేయడం జరుగుతుందని అన్నారు.

108 వాహనంలో ప్రసవం



ఏటూరునాగారం: కన్నాయిగూడెం మండల గుర్రేవుల గ్రామానికి చెందిన మహిళ 108 వాహనంలో ప్రసవించిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం గుర్రేవుల గ్రామానికి చెందిన సంధ్యకు పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108కు సమాచారం ఇచ్చారు. దీంతో సంధ్యను ఏటూరునాగారం వైద్యశాలకు తరలించి అక్కడ నుంచి ములుగు వైద్యశాలకు తరలిస్తుండగా మార్గ మధ్యలో నొప్పులు ఎక్కువ కావటంతో ఈఎంటీ నాగరాజు ఆమెకు వైద్య సేవలను అందించి ప్రసవం చేశారు. సంధ్య బిడ్డకు జన్మనిచ్చింది.

ఎస్సైగా వెంకటేశ్



కన్నాయిగూడెం: కన్నాయిగూడెం ఎస్సైగా వెంకటేశ్ శుక్ర వారం బాధ్యతలను చేపట్టారు. గతంలో ఇక్కడ ఎస్సైగా విధులు నిర్వహించిన సురేష్ బదిలీపై ములుగు వీఆర్‌కు వెళ్లడంతో ఆయన స్థానంలో వెంకటేష్‌ను వచ్చాడు.

కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి

ములుగు: అన్ని రకాల అర్హతలు ఉండి కొన్ని సంవత్సరాలుగా సమగ్ర శిక్షలో పని చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను వెంటనే రెగ్యులరైజ్ చేయాని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శిరుప సతీష్ కుమార్, మధుసూదన్ శుక్రవారం ఒక ఉమ్మడి ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడంతో గత ఏడాది సుమారు 30 రోజులు నిరవధిక సమ్మె చేశారని, ఆ సమయంలో ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 100 రోజుల్లో సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కానీ ఇప్పటికీ హామీ నెరవేరలేదని అన్నారు.

లారీ డ్రైవర్లకు కౌన్సెలింగ్



మంగపేట: మండలం మీదుగా ఇసుక క్వారీల నుంచి వెళ్లే ఇసుక లారీ డ్రైవర్లకు ఎస్సై టీవీర్ సూరీ గురువారం రాత్రి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. పరిమితికి మించి ఇసుకలోడుతో రవాణా చేయొద్దని హెచ్చరించారు. మద్యం సేవించి డ్రైవింగ్ చేయొద్దన్నారు.

అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ

మొగుళ్లపల్లి: నూతన జాతీయ విద్యావిధానంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాలను ప్రీ ప్రైమరీ స్కూల్‌లుగా తీర్చిదిద్దటానికిగాను అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ ఇవ్వటం జరుగుతుందని సీడీపీఓ అవంతిక అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో మండలంలోని రెండు సెక్టర్లలోని 37 మంది అంగన్‌వాడీ టీచర్లకు సీడీపీఓ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సూపర్‌వైజర్ రజిత, సంధ్యారాణి ,జయప్రదలు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న నిర్ణయంలో భాగంగా మండలంలో 3 రోజులు శిక్షణ ఇస్తున్నామని తెలిపారు.

ఆగిన గ్రామాల అభివృద్ధి

- 29 నెలలుగా రాష్ట్ర, ఆరు నెలలుగా కేంద్ర ప్రభుత్వాల నుంచి రాని నిధులు
- దిక్కుతోచని స్థితిలో పంచాయతీలు



నాగారం గ్రామ పంచాయతీ కార్యాలయం

వాజేడు: గ్రామ పంచాయతీలు నిధులు లేక నిస్సారంగా తయారయ్యాయి. గ్రామాల్లో ఎలాంటి అభివృద్ధి పనులను చేయాలన్నా గ్రామ పంచాయతీల్లో ఒక్క పైసా లేదు. దీంతో పారిశుద్ధ్య పనులు, తాగు నీరులాంటి అత్యవసర పనులను సైతం చేయలేని స్థితిలో ఉన్నాయి. గ్రామాల్లో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడనే అన్న చందంగా తయారైంది. సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసి పోవడంతో ప్రత్యేకాధికారులు పంచాయతీల బాధ్యతలను తీసుకున్నారు. పనులు చేయడానికి నిధులు లేక వారు కూడా ఏమీ చేయలేని పరిస్థితిల్లో ఉన్నారు.

ప్రభుత్వాల నుంచి రాని నిధులు

మండలంలో 17 గ్రామ పంచాయతీలు ఉండగా ప్రతీ నెల రాష్ట్రం నుంచి రూ.20 లక్షలు, కేంద్రం నుంచి రూ.20 లక్షలు ప్రతీ గ్రామ పంచాయతీలో జనాభా దామాషా ప్రకారం నిధులు జమ అయ్యేవి. వాటితో గ్రామాల్లోని సమస్యలను సత్వరమే పరిష్కరించడానికి అవకాశం ఉండేది. కానీ గడచిన 29 నెలలుగా రాష్ట ప్రభుత్వం నుంచి ఒక్క పైసా కూడా గ్రామ పంచాయతీల్లో జమ కాలేదు. దీంతో గ్రామ పంచాయతీ పరిధిలో పల్లెల్లో చేయాల్సిన పనులు చేయక పోవడంతో అభివృద్ధి కానరావడం లేదు. అలాగే కేంద్ర ప్రభుత్వం నుంచి 6 నెలలుగా పంచాయతీలకు ఒక్క రూపాయి కూడా జమకాలేదు.

సిబ్బందికి అందని వేతనాలు

గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న సిబ్బందికి ఆరు నెలలుగా వేతనాలు లేవు. దీంతో వారు కుటుంబాలను పోషించుకోవడం భారంగా మారింది. గ్రామ పంచాయతీల్లో పనులు చేస్తున్న వారికి ప్రభుత్వం నుంచి గ్రామ పంచాయతీల్లో నిధులు జమ కాక పోవడంతో జీతాలు ఇవ్వలేని పరిస్థితి వచ్చింది. గ్రామ పంచాయతీలకు రావాల్సిన ఇంటి, నీటి పన్నులను వసూలు చేసి రెండు నెలల వేతనాలను అందించారు. ఇంకా నాలుగు నెలల వేతనాలు ఇవ్వాల్సి ఉంది. వేతనాలు వచ్చినా రాకపోయినా సిబ్బంది పనులను మాత్రం క్రమం తప్పకుండా చేస్తున్నారు.

వర్షాకాలంలో మరింత ఇబ్బంది

వర్షాలు పడితే గ్రామాల్లో కొంత ఇబ్బంది కర వాతావరణం ఏర్పడనుంది. వర్షం పడగానే పిచ్చిచెట్లు పెరుగడంతో పాటు గుంతలు, కాలువల్లో నీరు నిలుస్తుంది. గ్రామాలు అపరిశుభ్రంగా ఉంటే దోమల వ్యాప్తి పెరిగే అవకాశం లేకపోలేదు. దీంతో గ్రామాల్లో బ్లీచింగ్ చల్లడంతో పాటు పలు పారిశుద్ధ్య పనులు చేపట్టాల్సి వస్తోంది. అంతే కాకుండా గ్రామ పంచాయతీల ద్వారా కొనుగోలు చేసిన ట్రాక్టర్లకు సంబంధించిన అప్పు కిస్తీలను చెల్లించాల్సి ఉంది. నిధులు లేక పోవడంతో వాటిని కూడా చెల్లించడం లేదు.

> **నిధులు రావడం లేదు**
>
> గ్రామ పంచాయతీల్లో ప్రస్తుతం నిధులు లేవు. ఏ పనులు చేయాలన్నా ఇబ్బందులు తప్పడం లేదు. రాష్ట్రం నుంచి 29 నెలలు, కేంద్రం నుంచి 6 నెలలకు సంబంధించిన నిధులు రావాల్సి ఉంది. అవి రాక పోవడంతో సిబ్బందికి కూడా వేతనాలు సరిగా అందించడం లేదు. నిధులు వస్తే గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి పనులను ముమ్మరంగా చేసే అవకాశం ఉంది.
>
> - శ్రీకాంత్ నాయుడు, ఎంపీఓ

న్యాయం చేయాలని వినతి



సీతక్కకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఏటూరునాగారం: పోడు భూముల్లో సాగు చేసుకుంటున్న దళితులకు న్యాయం చేయాలని కోరుతూ శుక్రవారం ఏటూరునాగారం పర్యటనకు వచ్చిన మంత్రి సీతక్కకు ఆదివాసీ దళిత సేవ సంఘం ఆధ్వర్యంలో వినతిప్రతం అందజేశారు. ఈ సందర్భంగా ఎడీఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పరికి శ్రీనివాస్ మాట్లాడుతూ మండల పరిధిలోని దొడ్ల కొత్తూరు, గ్రామానికి చెందిన దళితులు 24 సంవత్సరాలుగా పోడుభూములను సాగు చేసకుంటున్నారని అన్నారు. దళితుల భూమిని కొందరు గిరిజనులు దళితుల భూమిపై నకిలి పత్రాలు తయారు చేసుకోని దళితులను ఇబ్బందులు పెడుతున్నారని అన్నారు. ఇప్పటికైనా దళితుల పోడు భూములకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాజు, సత్యం, శ్రీను, రాజయ్య తదితరులు ఉన్నారు.

ఎస్సైని కలిసిన నాయకులు



ఎస్సైని సన్మానిస్తున్న నాయకులు

ఏటూరునాగారం: ఎస్సైగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన తాజొద్దీన్‌ను శుక్రవారం నాయక పోడు సేవ సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువా కప్పి సన్మానించారు. నాయకులు సమ్మయ్య, గండేపల్లి నర్సయ్య, కోడి గోపాల్, గండేపల్లి సత్యం, పున్నం రమేష్, చింతకుంట్ల మైనర్‌బాబు, బుచ్చి మల్లయ్య, సతీశ్ తదితరులు ఉన్నారు.

బొగ్గు గనుల వేలం ఆపాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్ రెడ్డి

గోవిందరావుపేట: బొగ్గుగనుల వేలం ఆపాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకట్ రెడ్డి అన్నారు. పస్రాలో శుక్రవారం నిర్వహించిన సీపీఎం మండల స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి రాగానే బొగ్గు గనుల శాఖ మంత్రిగా ఉన్న కిషన్ రెడ్డి హైదరాబాద్ కేంద్రంగా గనులను వేలం వేయడం దుర్మార్గమైన చర్య అని విమర్శించారు. బొగ్గు గనులని ప్రైవేటీకరించమని పేర్కొంటూనే వేలం పాటలు నిర్వహించడం దారుణమన్నారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా సింగరేణి మీద ఆధారపడి 80వేల మంది ఉపాధి పొందుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో గోవిందరావుపేట మండల కార్యదర్శి తీగల ఆదిరెడ్డి, సోమ మల్లారెడ్డి, కడారి నాగరాజు, అంబాల మురళి, యానాల ధర్మారెడ్డి, పల్లపు రాజు, బ్రహ్మచారి తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



నివాళులర్పిస్తున్న భిక్షపతి

ములుగు రూరల్: మల్లంపల్లి మండల సాధన సమితి అధ్యక్షుడు రాజు తండ్రి భిక్షపతి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ ముంజాల భిక్షపతిగౌడ్ శుక్రవారం పరామర్శించారు. మృతుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ గుగ్గిళ్ల సాగర్, నూనె శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

అధ్వానంగా ప్రభుత్వ ఆస్పత్రి



ఆస్పత్రి పరిసరాలను పరిశీలిస్తున్న జంపన్న

ములుగు: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి ఆధ్వానంగా ఉందని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు భూక్య జంపన్ననాయక్ అన్నారు. నాయకులతో కలిసి శుక్రవారం ఆయన జిల్లాకేంద్రంలోని ఏరియా ఆస్పత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆస్పత్రిలోని పరిసరాలు అపరిశుభ్రంగా, మరుగుదొడ్లు కంపు కొడుతున్నాయని అన్నారు. చేతులు శుభ్రం చేసుకోవడానికి వెళ్తే సింక్‌ను చూసి వెనక్కి రావాల్సిన పరిస్థితి ఉందని అన్నారు. కనీసం నీళ్లురావడం లేదని వాపోయారు. ఇదేనా కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆస్పత్రుల నిర్వహణ అని ప్రశ్నించారు. ఇటీవల జరిగిన ఓ సమావేశంలో ప్రభుత్వ ఆసుపత్రులు అంటే అమ్మలాంటివి అని కాంగ్రెస్ పెద్దలు చెప్పారని తీరా ఆస్పత్రిని చూస్తే అధ్వాన్నంగా ఉందని వాపోయారు. రోజువారిగా వచ్చే ఓపీ, ఐపీలకు సరిపడా డాక్టర్లు లేరని అన్నారు. ఆపదలో ఆస్పత్రికి వస్తే డాక్టర్లు వరంగల్కు రిఫర్ చేయడం ఏంటని అడిగారు. ఉన్నత చదువు చదివిన వైద్యులు ఉండి నేటికీ వరంగల్‌కి పరుగెత్తాల్సిందేనా అని ఆవేదన వ్యక్తం చేశారు. పిడియాట్రీషన్ ఉండి కూడా రెఫర్ చేస్తున్నారంటే ఆస్పత్రి పరిస్థితి అర్థం అవుతుందని వాపోయారు. ఆయన వెంట గుండారపు రాజు, అన్నారపు నాగర్జున ,దేవనబోయిన శ్రీను, బుర్రి దేవేందర్, సతీశ్, తిరుపతి, లక్ష్మణ్, విజయ్ తదితరులు ఉన్నారు.

ఉన్నత స్థాయికి చేరుకోవాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై

మహాముత్తారం: విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండి ఉన్నత చదువులు చదివి భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి ఎదగాలని మహాముత్తారం ఎస్సై మహేందర్‌కుమార్ అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శుక్రవారం మండలంలోని డొబ్బలపాడులోని మోడల్ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. మత్తు పదార్థాల వాడకం వల్ల ఆరోగ్యం చెడిపోవడమే కాకుండా మానసికంగా తీవ్ర ప్రభావం చూపుతుందని అన్నారు. విద్యార్థులు ఉన్నత చదువులు చదివి గురువులకు తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని సూచించారు.

సింగరేణి పరిరక్షణకు సమష్టి పోరాటాలు



సమావేశంలో మాట్లాడుతున్న ఐక్య కార్మిక సంఘాల నాయకులు

భూపాలపల్లి అర్బన్: సింగరేణి పరిరక్షణకు అన్ని సంఘాలు కలిసి సమష్టి పోరాటాలు నిర్వహించాలని సింగరేణి కార్మిక సంఘాల ఐక్య వేదిక రాష్ట్ర కన్వీనర్ రియాజ్ అహ్మద్ కో కన్వీనర్ కృష్ణ కోరారు. భూపాలపల్లి ఏరియాలోని తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం కార్యాలయంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కామెర గట్టయ్య ఆధ్వర్యంలో సింగరేణి కార్మిక సంఘాల ఐక్య వేదిక నాయకులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సింగరేణి ప్రాంతంలో ఉన్నటువంటి ఆరు బొగ్గు గనుల వేలం వేసే ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణకు వెన్నెముక లాంటి సింగరేణి పరిశ్రమను కాపాడుకునే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. కార్మిక సంఘాలు, రాజకీయ పార్టీలు ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ కార్మిక సంఘాల నాయకులు కృష్ణ, పోచమల్లు, నారాయణ, రాజన్న, నరేష్, సత్యం, మల్లేష్, జనార్దన్, ప్రసాదరెడ్డి పాల్గొన్నారు.

పీవీ సేవలు చిరస్మరణీయం

కాళేశ్వరం: దేశానికి మాజీ ప్రధాని పీవీ నరసింహారావు చేసిన సేవలు చిరస్మరణీయం అని ప్రిన్సిపాల్ ఎం.నర్సయ్య అన్నారు. మహదేవపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పీవీ నరసింహారావు జయంతిని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్థిక సంస్కరణల గురించి కొనియాడారు. ఆయన బహుభాషా కోవిందుడని భారతదేశానికి ఎన్నో రకాల పేరు ప్రఖ్యాతలు తీసుకొచ్చి ప్రభుత్వాన్ని నడిపినటువంటి ఒక గొప్ప నాయకుడని అన్నారు.

మెరుగైన పరిహారం చెల్లిస్తాం..

భూపాలపల్లి అర్బన్: మున్సిపాలిటీ పరిధిలోని గడ్డిగానిపల్లి గ్రామ ప్రజలకు మెరుగైన పరిహారం చెల్లిస్తామని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఓపెన్ కాస్ట్-2 ప్రాజెక్ట్‌లో భూమి కోల్పోతున్న గడ్డిగానిపల్లి గ్రామ ప్రజలకు శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ఓసీ-2లో నివాస గృహాలు, వ్యవసాయ భూములు కోల్పోతున్న ప్రతి ఒక్కరికీ నష్టపరిహారం చెల్లించనున్నట్లు చెప్పారు. 522 నివాస గృహాలు ఉన్నాయని, వాటిస్థానంలో మెడికల్ కళాశాల సమీపంలో ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద ఇంటి స్థలాలు, నష్ట పరిహారం ఇస్తామన్నారు. అనంతరం గ్రామస్తులు మాట్లాడుతూ.. ప్రధాన రహదారి నుంచి కాలనీ వరకు 60 ఫీట్ల రోడ్డు, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని, కాలనీలో రెండు దేవాలయాలు నిర్మించి ఇవ్వాలని కోరారు. ఇందుకు అధికారులు సానుకూలంగా స్పందించారు. ఈ సమావేశంలో ఆర్డీఓ మంగీలా ల్, సింగరేణి జీఎం హబీబ్‌హుస్సేన్ ఉన్నారు.

పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి



మాట్లాడుతున్న మమాంక్‌యాదవ్

ములుగు రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని అఖిల భారత విద్యార్థి పరిషత్ జిల్లా కన్వీనర్ మమాంక్ యాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయాన్ని ముట్టడించారు. ఏబీవీపీ నాయకులు గేట్లు దూకె ప్రయత్నం చేయగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా మమాంక్ యాదవ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు కల్పిస్తున్నామని చెప్పి ఆచరణలో మాత్రం కనబడుట లేదని ఆరోపించారు. ప్రభుత్వ పాఠశాలల్లో కుక్కలు, పందులకు ఆవాసాలుగా మారుతున్నాయని అన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో యాజమాన్యాలు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, అధిక ఫీజులు చేస్తూ నిరుపేద విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. ప్రైవేటు పాఠశాలల దోపిడీపై సమాచారం అందిస్తే చర్యలు తీసుకోని పరిస్థితిలో విద్యాశాఖ ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో జశ్వంత్, శ్రీతాన్, నవనీత్, రోహత్, కార్తిక్, పూర్ణ, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంపై అవగాహన



అవగాహన కార్యక్రమంలో గ్రామస్తులు

వెంకటాపురం(కె): మండల పరిధిలోని నాయకుల గూడెం గ్రామంలో కాఫెడ్ స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం సేంద్రియ వ్యవసాయం, కిచెన్ గార్డెన్‌ల పెంపకంపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏఈఓ శ్యామ్ సుందర్ హాజరై మాట్లాడారు. సేంద్రియ వ్యవసాయానికి ఖరీదైన ఎరువులు, పురుగు మందులు వాడాల్సిన అవసరం లేదని అన్నారు. సేంద్రియ ఉత్పత్తులు ఆరోగ్యానికి మంచివని అన్నారు. పెరటిలో ఉన్న కాళీ స్థలంలో కిచెన్ గార్డెన్ పెంచుకోవటం వల్ల కలిగే లాభాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో కాఫెడ్ స్వచ్ఛంద సేవ సంస్థ సిబ్బంది గొంది హనుమంతు, ఇందిరా, ఉషబూరాణి, పద్మ, ప్రశాంత్ తదితరులు ఉన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



వాజేడు: టైర్లలోని నీటిని పారబోస్తున్న సిబ్బంది

వాజేడు: ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వాజేడు వైద్యాధికారి మధుకర్ అన్నారు. శుక్రవారం వాజేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఫ్రైడే, డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతీ ఇంటికి వెళ్లి నిలువ ఉన్న నీటిని, ప్లాస్టిక్ వస్తువుల్లో ఉన్న నీటిని పార బోశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ.. ప్రజలు అప్రమత్తంగా ఉంటే జ్వరాలు రావని సూచించారు.

కాటారం: పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే వ్యాధులు దూరంగా ఉంటాయని మండల వైద్యాధికారిణి డాక్టర్ మౌనిక అన్నారు. మండల కేంద్రంలో డ్రై డేలో భాగంగా వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, ఆశ కార్యకర్తలు ప్రతి ఇంటిలో నీటి నిల్వలు లేకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బడీడు పిల్లలందరూ బడిలో చేరాలి



ర్యాలీ నిర్వహిస్తున్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

వెంకటాపురం(ఎం): బడీడు పిల్లలంతా పాఠశాలల్లో చేరాలని కోరుతూ మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. పాఠశాలలో సేఫ్, బ్యాక్ టూ స్కూల్ కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించడం జరిగిందని జెడ్పీ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు జనగాం బాబురావు, బాల రక్ష భారత్ ప్రతినిధి తేజావత్ రవికుమార్ పేర్కొన్నారు. తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపి భవిష్యత్‌కు బంగారు బాట వేయాలన్నారు.

విద్యుదాఘాతంతో పశువుల మృతి



ఎస్ఎస్ తాడ్వాయి: మృతి చెందిన గేదెలు

ఎస్ఎస్‌తాడ్వాయి: విద్యుదాఘాతంతో రెండు సుడి గేదెలు మృతి చెందిన ఘటన గురువారం రాత్రి మండల కేంద్రంలోని కామారం శివారులో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. మండల కేంద్రంలోని నర్సింగాపూర్ గ్రామానికి చెందిన పిట్టల పోశాలు, మల్లెబోయిన కృష్ణలకు చెందిన సుడి గేదెలు గురువారం మేత కోసం వెళ్లి కామారం శివారులోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్ వైరు తగిలి షాక్ గురై మృతి చెందాయి. మృతి చెందిన ఒక్కో గేదె విలువ సుమారుగా రూ.30వేల వరకు ఉంటుందని ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతులు కోరారు.



వెంకటాపురం(ఎం): మృతిచెందిన దుక్కిటెద్దు

వెంకటాపురం(ఎం): విద్యుదాఘాతంతో దుక్కిటెద్దు మృతి చెందిన సంఘటన మండలంలోని అడవిరంగాపూర్‌లో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దామెర శేషమ్మకు చెందిన దుక్కిటెద్దు మేత కోసం గ్రామ శివారులోకి దుక్కిటెద్దును వదిలిపెట్టింది. కాగా ఇంటికి తిరిగి రాకపోవడంతో ఎద్దుకోసం గాలించగా ట్రాన్స్‌పార్మర్ వద్ద షాక్ గురై ఎద్దు మృతి చెంది ఉంది. ట్రాన్స్‌పార్మర్ చుట్టూ కంచె లేకపోవడం కారణంగానే రూ.60 వేల విలువ చేసే ఎద్దు మృతిచెందిందని బాధితురాలు వాపోయారు.

నేడు 'రైతు భరోసా'పై సమావేశం

వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని సొసైటీ ఫంక్షన్ హాల్‌లో నేడు(శనివారం) రైతు భరోసా పథకంపై పీఏసీఎస్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహిస్తున్నట్లు సొసైటీ కార్యదర్శి సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10:30 గంటలకు ప్రారంభమతుందని తెలిపారు. రైతు భరోసా పథకంపై రైతుల నుంచి పలు సూచనలు సలహాలను తీసుకోనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలో రైతులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు.